క్లుప్తంగా

నేడు ప్రజాదర్బార్

ఎర్రగుంట్ల : పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 6.30 గంటలకు నిర్వహించనున్న ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డిలు పాల్గొంటారని మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండల, పట్టణ ప్రజలు ఈ ప్రజాదర్బార్‌ను ఉపయోగించుకోవాలని ఆయన తెలిపారు.

నేడు స్కూల్ ఆటల పోటీల ఎంపిక

సింహాద్రిపురం : మండలంలోని హిమకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మండలస్థాయి ఆటల పోటీల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ పోటీలు అండర్–14, అండర్–17 బాలబాలికలకు వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ సంబంధించిన పోటీలు నిర్వహిస్తారన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు పాల్గొనాలని పీఈటీ రామకృష్ణారెడ్డి తెలిపారు.

పంటల ఈ క్రాప్ పరిశీలన

సింహాద్రిపురం : మండలంలోని నంద్యాలంపల్లె, కసునూరు, లోమడ, తదితర గ్రామాల్లో ఖరీఫ్‌లో సాగుచేసిన వివిధ రకాల పంటల ఈ క్రాప్ సరళిని గురువారం ఏఓ శివమోహన్‌రెడ్డి పరిశీలించి మాట్లాడారు. ప్రతిరైతు తమ పంటలకు తప్పనిసరిగా ఈ క్రాప్ చేయించుకుంటేనే పంటల బీమా, పంటనష్టం వస్తుందన్నారు. చీనీ రైతులు చీనీ సాగులో అంతర్ పంటను కూడా ఈ క్రాప్ చేయించుకోవచ్చన్నారు. గ్రామాల్లో రెవెన్యూ, సచివాలయ సిబ్బంది సహకరించి ప్రతి రైతుకు ఈ క్రాప్ చేయించాలన్నారు. ఇప్పటివరకు 14,903 ఎకరాలలో ఈ క్రాప్ చేసి జిల్లాలో సింహాద్రిపురం మండలం పదవ స్థానంలో ఉందన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

పులివెందుల రూరల్ : పట్టణంలోని క్రిస్టియన్ లైన్‌లో గురువారం హెల్త్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, నాగ్లా నాయక్‌ల ఆధ్వర్యంలో క్షయవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. క్షయవ్యాధి లక్షణాలు రెండువారాలు పైబడి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గిపోవడం వంటి లక్షణాలుంటే క్షయవ్యాధిగా గుర్తించాలన్నారు. ఈ లక్షణాలున్న వారు వెంటనే గళ్ల పరీక్ష చేయించుకోవడం వల్ల క్షయ వ్యాధిని తెలుసుకోవచ్చన్నారు. క్షయవ్యాధి నిర్ధారణ అయిన తర్వాత 6 నెలల పాటు మందులు తీసుకోవడం వల్ల ఈ జబ్బును నయం చేసుకోవచ్చన్నారు.

అర్హులైన వారికి పింఛన్లు

పులివెందుల రూరల్ : సదరం క్యాంపు ద్వారా అర్హులైన వారికి పింఛన్లను పంపిణీ చేస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డేవిడ్ సెల్వరాజ్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సదరం క్యాంపు నిర్వహించారు. సదరం క్యాంపునకు నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వికలాంగులు, వృద్ధులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వారికి వైద్యపరీక్షలు నిర్వహించి అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేస్తామన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు


లింగాలలో ఉట్టి కొట్టేందుకు పోటీపడుతున్న యువకులు


వీఎన్‌పల్లె : సంగాలపల్లె గోశాలలో ఉట్టికొడుతున్న మహిళ

కమలాపురం : పట్టణంలోని శ్రీరాధాకృష్ణ ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి, ఆలయ ఏడవ వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేద పండితుల ఆధ్వర్యంలో గోపూజను నిర్వహించారు. అనంతరం మూల మూర్తులకు అభిషేకాలను, విశేష పూజలను నిర్వహించారు. అనంతరం సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణము, భజనలు, తులసీ సహస్రనామార్చన, కుంకుమార్చన నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. పలువురు చిన్నారులు శ్రీ కృష్ణుని వేష ధారణలో అందరినీ అలరించారు. రాధాకృష్ణుల గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించి బహుమతులు అందచేశారు. పాలపళ్ల విభాగం బండలాగుడు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు నరసింహారెడ్డి దంపతులు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : మండలంలోని రామన్నూతనపల్లె గ్రామంలోని శ్రీకృష్ణ దేవాలయంలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని శిలావిగ్రహానికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. చెక్కభజనలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి. గ్రామంలో యువకులచే ఉట్టికొట్టే పోటీలను నిర్వహించారు. శ్రీకృష్ణుని ఉత్సవవిగ్రహాన్ని పల్లకిలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో రామట్లపల్లె, గుణకనపల్లె, చిన్నకుడాల, తదితర గ్రామాల ప్రజలు పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

వీఎన్‌పల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని సంగాలపల్లె శ్రీ శివకృష్ణ గోశాల, అడవిచెర్లోపల్లె గ్రామ సమీపంలో కొండపై వెలసిన వేణుగోపాలస్వామి ఆలయం, వీరపునాయునిపల్లె ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని కృష్ణాలయంలో గురువారం కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. ఎర్రగుంట్ల నడివీధి రామాలయం భజన బృందం నిర్వహించిన భజన కార్యక్రమం భక్తులను అలరించింది. ఉట్టి కొట్టే కార్యక్రమంలో పురుషులతో పాటు మహిళలు పోటీ పడ్డారు. పోటీల్లో గెలుపొందిన వారికి నిర్వాహకుడు కల్లూరు రాజశేఖర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో కృష్ణాష్టమి సందర్భంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. రాత్రి చెక్కభజన తదితర కార్యక్రమాలు అలరించాయి. అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.

చెన్నూరులో..

చెన్నూరు : మండల వ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొండపేటలోని ఇస్కాన్ టెంపుల్‌లో, చెన్నూరులోని శ్రీసీతారామ సంకీర్తన క్షేత్రంలో, మండలంలోని రామనపల్లిలో వేడుకలు నిర్వహించారు. భజనలు, కీర్తనలు ఊంజల సేవ, పవళింపు సేవతో పాటు ఘనంగా రాధాకృష్ణుల కల్యాణం నిర్వహించారు. కల్యాణం చూడడానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. రామనపల్లెలోని పురోహితులు వెంకటేశ్వర్ల శర్మ నేతృత్వంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం రాధాకృష్ణుల గ్రామోత్సవం నిర్వహించారు,

ముద్దనూరులో..

ముద్దనూరు : మండలంలోని ఉప్పలూరు గ్రామంలో ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

నేడు గంగమ్మ దేవాలయ ప్రథమ వార్షికోత్సవం

లింగాల : మండలంలోని అంబకపల్లెలో వెలసిన శ్రీగంగమ్మ దేవత ఆలయ ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, నూతనవస్త్ర పుష్పాలంకరణ, అష్టోత్ర మహా కుంభ నివేదన నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటల నుంచి మహిళలచే లక్ష కుంకుమార్చన కార్యక్రమం, అదేవిధంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. భక్తులందరు అమ్మవారి కుంకుమార్చనలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రైల్వే గూడ్స్ హమాలీల సమస్యలను పరిష్కరించాలి

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప రైల్వే స్టేషన్ గూడ్స్‌లో హమాలీల సమస్యలను పరిష్కరించాలని రైల్వే గూడ్స్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు కేసీ.బాదుల్లా, ఎస్ మహబూబ్ బాషా పేర్కొన్నారు. గురువారం కడప రైల్వే స్టేషన్ పరిశీలనకు వచ్చిన డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్‌కు వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు అసౌకర్యంగా ఉన్న ప్లాట్ ఫామ్ సరిచేయాలని, మౌలిక వసతులైన తాగునీరు ఉపయోగించే ఫ్రిడ్జ్ చెడిపోవడం మూలంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. యూనియన్ కార్యాలయం పైన నీటి ట్యాంకు ప్యూరిఫైడ్ ఫిల్టర్స్ ఏర్పాటు చేయాలని కోరారు. మరుగుదొడ్లు కూడా కార్యాలయం ఆవరణలో కాకుండా బయట తగినన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రత్యామ్నాయ పంటపై దృష్టి పెట్టాలి

వీరపునాయునిపల్లె : ఖరీఫ్ సీజన్‌లో పంట సాగు చేయకుండా ఉన్న పొలంలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు రైతులు దృష్టి పెట్టాలని కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని ఉరుటూరు, ఇందుకూరు రైతు భరోసా కేంద్రాలను అయన తనిఖీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం రాయితీతో మినుములు, పెసలు వంటి విత్తనాలను అందిస్తోందన్నారు. సబ్సిడీ విత్తనాలు కావలసిన రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. విత్తనం పొందిన ప్రతి రైతు పంట సాగు చేయడంతో పాటు పంట నమోదు చేయించుకోవాలన్నారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రబీ సీజన్‌కు సంబంధించి ముందుగానే ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. అనంతరం ఇందుకూరు రైతు భరోసా కేంద్రంలో ఉన్న ఎరువులను తనిఖీ చేయడంతో పాటు ఉరుటూరు రైతు భరోసా కేంద్రంలో చేపడుతున్న విత్తన నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు, ఇందుకూరు, ఉరుటూరు రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, ఎంపీటీసీ వెంకటరామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నేడు ఆత్మీయ కృతజ్ఞతా సమావేశం

వల్లూరు : మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతం కావడంతో కడప సమీపంలోని ఆలంఖాన్‌పల్లె సర్కిల్ నుంచి రాజంపేట వెళ్లే బైపాస్ రోడ్డులోని డీఎస్ ఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆత్మీయ కృతజ్ఞతా సమావేశం జరుగుతుందని మండల వైఎస్ఆర్‌సీపీ కన్వీనర్, మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్‌టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. మండల పరిధిలోని వైఎస్ఆర్‌సీపీ నేతలు, ప్రజా ప్రతినిధులు, జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కమలాపురం : మండలంలోని కోగటం గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, చింతకొమ్మదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డిలు పాల్గొంటారని ఎంపీడీవో శేషాచలపతి ఒక ప్రకటనలో తెలిపారు.

మైనార్టీలకు అండగా ఉంటాం

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలో ఉన్న మైనార్టీ సోదరులకు ఎప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని అక్బహర్ మసీదు వీధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాట్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. అక్బహర్ మసీదు వీధిలో త్వరగా సీసీ రోడ్డు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ముద్దనూరు ఎంపీపీ ప్రదీప్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు పెన్నారషీద్, కో ఆప్షన్ సభ్యులు డి.సూర్యానారాయణరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్నకు చెబుదాం’ను విజయవంతం చేయండి

వేముల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మండలవాసులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, పులివెందుల ఆర్డీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం జగనన్నకు చెబుదాం కార్యక్రమ ఏర్పాట్లపై ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, తహసీల్దార్ వెంకటసుబ్బయ్యలతో ఆయన చర్చించి మాట్లాడారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో శుక్రవారం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయరామరాజుతో పాటు జిల్లా అధికారులందరూ పాల్గొంటున్నారన్నారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు పాల్గొని తమతమ సమస్యలను అర్జీల రూపంలో కలెక్టర్ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమం మొదటిసారి వేముల మండలంలో నిర్వహిస్తున్నారన్నారు.


అధికారులతో చర్చిస్తున్న మండల ఇన్‌చార్జి, ఆర్డీఓ

సంక్షేమ సారథి సీఎం జగన్


లబ్ధిదారులకు పెన్షన్ పుస్తకాలను అందజేస్తున్న జడ్పీటీసీ

వేంపల్లె : సంక్షేమ పథకాల సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని జడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబులరెడ్డి, హజ్‌కమిటీ డైరెక్టర్ మునీర్‌లు కొనియాడారు. గురువారం స్థానిక వైఎస్ఆర్ షాదీఖానాలో ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన కొత్తగా మంజూరైన వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యాప్తంగా కొత్తగా మంజూరై 457 పింఛన్లను పంపిణీ చేసి మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కొత్త పింఛన్ల కోసం పడిగాపులు పడాల్సివచ్చేదని వైకాపా ప్రభుత్వంలోఅర్హతే ప్రామాణికంగా పింఛన్లు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ రవీంద్రనాథ్‌రెడ్డి, ఏపీఎం బాలస్వామి, ఈఓ సుబ్బారెడ్డి, కోఆప్షన్ అస్సానయ్య,ఎంపీపీ బాబాషరీఫ్, ఎంపీటీసీలు, వార్డుసభ్యులు, సచివాలయ ఉద్యోగులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా పోటీలను విజయవంతం చేయండి

స్థానిక ఉర్దూఘర్ షాదీఖాన కల్యాణ మండపంలోని వివిధ క్రీడాకారులతో జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి సమావేశం ఏర్పాటు చేసి మట్లాడారు. 15 సంవత్సరాలు దాటిన యువత కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడలతో పాటు ఇతర సంప్రదాయ క్రీడలను కూడా విలీనం చేసి పోటీలను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిపారు. మండల క్రీడాకారుల ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ అక్టోబర్ 2నుంచి 8వ తేదీ వరకు గ్రామ, వార్డుస్థాయిల్లో, 10 నుంచి 19వ తేదీ వరకు మండలస్థాయిలో వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ గురుప్రసాద్, డిగ్రీ కళాశాల పీడీ తేజేంద్ర, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంతో ఆనందంలో ప్రజలు

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి అర్హత ఉండి సంక్షేమ పథకాలు రాని వారికి అక్కడే ప్రజల సమస్యలు పరిష్కరిస్తే ప్రజల కళ్లల్లో కలిగే ఆనందం అంతా ఇంతా కాదని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. కడప నగరంలోని మహలక్ష్మి కల్యాణ మండపంలో గురువారం పెండ్లిమర్రి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్ల, సచివాలయ సిబ్బందికి ఆత్మీయ కృతజ్ఞత సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నా పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందాయా లేదా తెలుసుకోవడానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడిందన్నారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలో ఇలాంటి కార్యక్రమం చేపట్టలేదన్నారు. సీఎం జగన్ దూర దృష్టి గల నాయకుడు కాబట్టే అనేక సంక్షేమ పథకాలు అమలు చేశాడన్నారు. అనంతరం సీకేదిన్నె జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, ఏపీ పొల్యూషన్ బోర్డు డైరెక్టర్ పాక సురేష్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ రామమోహన్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, మండల బూత్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు నాగమల్లారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ అందిన సంక్షేమ ఫలాలు


ప్రజలకు సంక్షేమ పథకాలగురించి తెలుపుతున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాయని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని మిస్సమ్మ బంగ్లా సచివాలయ పరిధిలోని తూర్పు ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయనతో పాటు మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డిలు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రార్ కార్యాలయం వెనుక ప్రాంతం, మిస్సమ్మబంగ్లా, వీరభద్రస్వామిగుడి, బూడిదబాయి తోట, జెండామాను వీధి తదితర ప్రాంతాలలో వారు పర్యటించారు. ప్రజలు అన్ని పథకాలు సకాలంలో అందుతున్నాయని వారికి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, కౌన్సిలర్లు, ఖాదర్‌బాషా, సలీమ, కోడి రమణ, పార్నపల్లె కిషోర్, ఆలయాల చైర్మెన్లు సుధీకర్‌రెడ్డి, నాగేంద్ర ప్రసాద్, మాజీ చైర్మెన్ యార్వ వెంకటసుబ్బయ్య, బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్, జేసీఎస్ కన్వీనర్ చంద్రమౌళి, మాజీ అధ్యక్షుడు సోపాల వీరా, కోఆప్షన్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల విభాగంలో వర్ష, మౌనిక, నవనీత, పురుషుల విభాగంలో మురళీమోహన్, మునాఫ్, సిద్దిక్‌లు ప్రతిభ కనబరచి సీనియర్ షూటింగ్ బాల్ పోటీలకు జిల్లా తరఫున ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 8, 9, 10 తేదీలలో నెల్లూరు జిల్లా కావలి పట్టణంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సీనియర్ షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. వీరు ఎంపిక కావడంపట్ల కళాశాల ప్రిన్సిపాల్, ఫిజికల్ ఎడ్యుకేషన్ బాలకొండ గంగాధర్, లైబ్రేరియన్ మాధవరావు, ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర, సీనియర్ అసిస్టెంట్ మహేష్, అధ్యాపక, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీలోకి 50 కుటుంబాలు చేరిక


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారు

ఎర్రగుంట్ల : మండలంలోని కలమల్ల గ్రామ పరిధిలోని ఎస్సీ కాలనీలో 50 కుటుంబాలు గురువారం ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వీరందరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో పెద్దనపాటి వెంకటేష్, ఉమ్మడి శివ కుమార్, రమణ, పెద్ద బాలముని, ఓబులేసు, రమేష్, నాగరాజు, సురేష్, చిరంజీవి, ఇతరులు ఉన్నారు. వీరు పార్టీ అభివృద్ధికి, పార్టీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నారపురెడ్డి, వై.రాజారెడ్డి, సుబ్బారెడ్డి, గిరి, శ్రీనివాసులు(చిన్న), తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లల నమోదుపై కమిటీ ఏర్పాటు

చెన్నూరు : మండలంలో ఆరు సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల వయసు గల నమోదుకాని బడిఈడు పిల్లలు 271 మందిని గుర్తించామని వీరందరూ కూడా నమోదు అయ్యేవిధంగా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో గంగనపల్లి సురేష్‌బాబు తెలిపారు. గురువారం మధ్యాహ్నం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో పాఠశాలల ఉపాధ్యాయులకు ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు.

మండల వ్యాప్తంగా ఉన్న 271 మంది పిల్లలను నమోదు అయ్యేవిధంగా ఉపాధ్యాయులు పనిచేయాలని దీనికిగాను ఒక కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో హెడ్మాస్టరు, మహిళా పోలీస్, ఒక వలంటీర్ ఉంటారని తెలిపారు. ఈ కమిటీ గ్రామాల లోకి వెళ్లి పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి నమోదు అయ్యేవిధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 సునీత, ఎంఈఓ గంగిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయు లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు